క్లుప్తంగా

ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే చర్యలు తప్పవు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి

యాడికి: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఉదయం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని రౌడీషీటర్లకు ఎస్‌ఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ నెల 19న వార్డు ఉప ఎన్నికలు ఉన్న గ్రామాల్లోని రౌడీషీటర్లు అందరూ పోలీస్‌స్టేషన్‌లోనే ఉండాలన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు వస్తే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

విద్యార్థులకు కథల పోటీలు



విజేతలతో ఉద్యోగ, ఉపాధ్యాయ సేవా సంస్థ సభ్యులు

తాడిపత్రి: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. టైలర్స్ కాలనీలోని స్థానిక వివేకానంద పాఠశాలలో జరిగిన పోటీల్లో పట్టణంలోని వివిధ పాఠశాలకు చెందిన 8,9,10 విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 10 మందికి కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. సంస్థ అధ్యక్షుడు డోగూరు శ్రీహరి, కన్వీనర్ చెన్నకేశవులు, ప్రధాన కార్యదర్శి శంకర్, శ్రీరంగయ్య, గుర్రప్ప, కుమార్‌స్వామి, బిసి ఓబులేసుయాదవ్, కేజీబీవీ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గుత్తి: కొజ్జేపల్లి గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..పట్టణానికి చెందిన వంశీ, రామాంజనేయులు వైటీ చెరువులో పని ముగించుకుని బైక్‌పై గుత్తికి బయలుదేరారు. కొజ్జేపల్లి సమీపంలో బైక్ అదుపు తప్పిరోడ్డు పక్కన ఉన్న మట్టి కుప్పకు ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. 108లో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు వారిని అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

2కే రన్‌కు విశేష స్పందన




రన్నర్స్‌కు బహుమతి అందజేస్తున్న అర్బన్ సీఐ హమీద్‌ఖాన్

తాడిపత్రి: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం క్యారీ నౌ సంస్థ నిర్వహించిన 2కె రన్‌కు విశేష స్పందన లభించింది. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఉదయం 6 గంటలకు 2కే రన్‌ను అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ జెండా ఊపి ప్రారంభించారు. 2కే రన్ అంబేడ్కర్ సర్కిల్ నుంచి సీబీ రోడ్డు మీదుగా పెన్నా నది వంతెన సమీపంలోని పార్క్ వద్దకు చేరుకుంది. అక్కడ రన్‌లో పాల్గొన్న అందరికీ సీఐ బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామం దినచర్యలో ఓ భాగం కావాలన్నారు. వ్యాయామంతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.

జలధికి తరలిన పీర్లు

గార్లదిన్నె: తిమ్మంపేటలో మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం పీర్ల స్వాములు జలధి వేడుకలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పీర్ల స్వాములు అగ్నిగుండం ప్రవేశం చేశాయి. అనంతరం గ్రామంలో పీర్లను మేలతాళా లతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పీర్ల స్వాములు జలధికి తరలివెళ్లాయి. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరంలో యువభారత్ సభ్యులు

పెద్దపప్పూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని యువ భారత్ సేవాసమితి అధ్యక్షురాలు రేణుక అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో యువభారత్ సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రేణుక మాట్లాడుతూ అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. పలు గ్రామాలకు చెందిన దాదాపు 59మంది యువకులు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు రాజు, శశిధర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బోధనలో నూతన ఒరవడి

- డిజిటల్, స్మార్ట్ బోధనకు ప్రభుత్వం శ్రీకారం
- సులువుగా అర్థమయ్యేలా బోధన
- నియోజకవర్గానికి 219 ఐఎఫ్‌పీ, 85 స్మార్ట్ టీవీలు



గుంతకల్లులోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ హైస్కూల్‌లో ఐఎఫ్‌పీ ద్వారా విద్యా బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు నిర్మల్‌కుమార్

గుంతకల్లు: ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి జగనన్న ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందడుగు వేస్తోంది. నాడు–నేడు కింద కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తోంది. ప్రతి విద్యార్థికి పాఠాలు సులభంగా అర్థం అయ్యేందుకు ఏయే వనరులు అవసరమో వాటన్నింటినీ సమకూరుస్తోంది. విద్యార్థులకు నాణ్యమైన చదువుతోపాటు బోధనలో ఆధునిక టెక్నాలజీని అందుబాటులోకి తెస్తోంది. విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు టీచర్లు ఇప్పటి వరకూ తరగతి గదుల్లో బ్లాక్ బోర్డు వాడేవారు. అయితే ఇప్పుడు వాటి స్థానంలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ)లను అందుబాటులోకి తెచ్చింది.

నియోజకవర్గంలో...

నియోజకవర్గంలోని గుంతకల్లు, గుత్తి, పామిడి పట్టణ, మండలాల్లో దాదపు 219 ఐఎఫ్‌పీలు, 85 స్మార్ట్ టీవీలను సమకూర్చింది. ఫస్ట్ పేజ్ కింద గుంతకల్లుకు 93 ఐఎఫ్‌పీ, 49 స్మార్ట్ టీవీలు, గుత్తికి 83 ఐఎఫ్‌పీ, 25 స్మార్ట్ టీవీలు, పామిడికి 43 ఐఎఫ్‌పీ, 11 స్మార్ట్‌టీవీలను అందజేశారు. వీటిని ఏర్పాటు చేసిన పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలను ఆయా పాఠశాలల్లో సాంకేతిక నిపుణులతో అమర్చారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులను ఏ విధంగా వినియోగించాలనే విషయమై ఇదివరికే ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ శిక్షణలో రెండు రోజులు పాటు అవగాహన కల్పించారు. ఇదివరకు టీచర్లు కొత్త విషయాలను విద్యార్థులకు చెప్పాలంటే సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకునేవారు. కొత్త విధానం అందుబాటులోకి రావడంతో ఒక క్లిక్‌తోనే విద్యార్థులకు అన్ని విషయాలను చూపించొచ్చు. ఈ విధానం వల్ల విద్యార్థులకు కొత్త అంశాలు సులభంగా అర్థం అవుతాయి.

సమయం ఆదా..

ప్రతి సబ్జెక్టుకు కేవలం 45 నిమిషాలు మాత్రమే సమయం ఉంటుంది. లెక్కలు, సైన్స్ పాఠ్యాంశాల బోధన సమయంలో ఉపాధ్యాయుడు బ్లాక్ బోర్డుపై చాక్‌పీస్‌తో బొమ్మలు వేసి విద్యార్థులకు వివరిస్తున్నారు. బొమ్మ గీయడానికి దాదాపు 20 నిమిషాల సమయం వృథా అవుతుంది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. క్లిక్ చేసిన వెంటనే వివిధ రంగుల్లో బొమ్మలు ప్రత్యక్షమై సులభతరం అవుతుంది. అంతేకాకుండా విద్యార్థులకు సందేహాలు ఉంటే వెంటనే వాటిని బోర్డుపై ప్రదర్శించి నివృత్తి చేయవచ్చు. విద్యార్థులకు కష్టతరమైన పాఠ్యాంశాలైనా దృశ్య విధానం ద్వారా ఎక్కువ కాలం గుర్తుండే అవకాశం ఉంది. మ్యాపులు, చిత్రాల ద్వారా చూపించే కొన్ని అంశాలను నేరుగా ఫొటోతో సహా చూపించడానికి వీలు ఉంటుంది.

విద్యారంగానికి పెద్దపీట



పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యారంగానికి పెద్దపీట వేశారు. ఇందులో భాగంగా కోట్లాది రూపాయలతో నాడు–నేడు కింద పాఠశాలలను ఆధునీకరించారు. డిజిటల్ విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ప్రభుత్వం బైజూస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. విద్యార్థులకు జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన పోషకాహారం అందిస్తున్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థానాలకు ఎదగాలి.

– వై.వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే గుంతకల్లు

బోధన సులభతరం



ఐఎఫ్‌పీ విధానంలో బోధన వల్ల పాఠ్యాంశాలు సులభంగా అర్థమై విద్యార్థుల మదిలో నిలిచిపోతాయి. ముఖ్యంగా ఉపాధ్యాయులకు వారికి కేటాయించిన సమయంలో విద్యాబోధన పూర్తి చేయొచ్చు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం పెంపొందించడానికి దోహదపడతాయి.

– మస్తాన్‌రావు, ఎంఈఓ, గుంతకల్లు

19న పెట్రోల్ బంకు ప్రారంభం

యల్లనూరు: మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయం ఎదురుగా సొసైటీ ఆధ్వర్యంలో నూతన పెట్రోల్ బంకును శనివారం ప్రారంభించనున్నట్లు సీఈఓ వీరనారప్ప తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నం

గుంతకల్లుటౌన్: తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి యత్నించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఎస్‌జేపీ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్‌కే.హుసేన్ హనుమేష్‌నగర్‌లో అద్దెకుంటున్నాడు. అతను కుటుంబసభ్యులతో కలిసి శనివారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లారు. విషయాన్ని గమనించిన దుండగులు తాళాల్ని బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాల్లో వెతికినా నగదు, నగలు దొరకకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఆదివారం ఉదయం హుసేన్‌కు చుట్టుపక్కల వారు ఫోన్ చేసి విషయాన్ని చేరవేయడంతో ఆయన వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఇంట్లో నగదు, నగలు ఏమీ ఉంచలేదని బాధితుడు తెలియజేశారు.

వర్షం కోసం గ్రామ దేవతకు పూజలు

తాడిపత్రి: వర్షం కోసం చిన్నపొలమడ గ్రామంలో ఆదివారం సర్పంచ్ ఎల్.పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో వెలసిన సత్యమ్మ దేవతకు జలాభిషేకం చేశారు. గ్రామస్తులందరూ సత్యమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండి ప్రజలందరూ సంతోషంగా ఉండాలని పూజలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

2024 ఎన్నికలే లక్ష్యంగా పని చేద్దాం



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు(విద్య) ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: 2024 ఎన్నికలే మన లక్ష్యమని, సంక్షేమ పథకాలు, పార్టీ నిర్ణయాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళదామని ప్రభుత్వ సలహాదారు (విద్య)ఆలూరు సాంబశివారెడ్డి వైఎస్సార్‌సీపీ యువ నాయకులకు సూచించారు. ఆదివారం ఎస్ఆర్ఐటీలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ యువ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో యువత బాగా ప్రచారం చేయడం వల్ల తిరుగులేని విజయం సాధించామన్నారు. మరింతగా బాగా పని చేసి 2024 ఎన్నికల్లోను ఘన విజయం సాధిద్దామన్నారు. వైఎస్సార్‌సీపీపై ప్రతిపక్ష పార్టీలు సోషల్ మీడియాలో వ్యతిరేకంగా పోస్టులు చేస్తున్నాయని, వాటన్నింటినీ తిప్పి కొట్టాలన్నారు. దీంతో పాటు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, పార్టీ చేపట్టబోయే నిర్ణయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. బాగా పని చేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్నను మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి



ఎద్దులపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి

పామిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం ఎద్దులపల్లిలో సర్పంచ్ జీ వెంకటరమణమ్మ, వీరా, చుక్కలూరు దిలీప్ రెడ్డి, చుక్కలూరు రామకృష్ణారెడ్డి, చుక్కలూరు రామచంద్రారెడ్డి, వెంకట్రామిరెడ్డి, సంజీవరెడ్డి, గుంతకల్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వారికి గ్రామస్తులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఎద్దులపల్లి రోడ్డు పాయింట్ నుంచి గ్రామంలోకి సీసీరోడ్డు నిర్మాణంలో జాప్యాన్ని నివారించాలని గ్రామస్తులు కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. పేదలు రామసుబ్బమ్మ, దళిత మధు, కుమారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయం అందించారు,

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఎన్నికల కోసం మోసపూరిత హామీలిచ్చే చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్‌ను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో నమ్మరన్నారు. రాష్ట్రంలో జగనన్నకు వస్తున్న ఆదరణ ఓర్వలేక చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పచ్చమీడియాతో కలిసి బురదజల్లేందుకు యత్నిస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా ముందుకు సాగుతున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ సీబీ జానకిరామిరెడ్డి, మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీ మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నక్కా సౌభాగ్య, ఓసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కుమ్మెత లక్ష్మి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, పట్టణ, రూరల్ సచివాలయాల కన్వీనర్లు బీ ఆసిఫ్, ఎం కుమార్‌రెడ్డి, జోజోడే కుమార్, సంజీవరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

కుళ్లాయప్పకు స్నేహితుల భరోసా



కుళ్లాయప్పకు నగదు అందిస్తున్న చిన్ననాటి మిత్రులు

నార్పల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఓ వ్యక్తికి స్నేహితులు తామున్నామంటూ ముందుకొచ్చారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. వివరాల్లో కెళితే.. మండలంలోని బి.పప్పూరు గ్రామానికి చెందిన కుళ్లాయప్ప గత నెలలో గూగూడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బత్తలపల్లి ఆర్డీటీ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అతని వైద్యానికి అధిక మొత్తం ఖర్చు అవుతుందని తెలుసుకున్న అతడి చిన్ననాటి స్నేహితులు (బి.పప్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000 టెన్త్ బ్యాచ్) మిత్రుని వైద్యానికి ఆర్థికసాయం చేశారు. ఆదివారం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి చేరుకుని రూ.1.14 లక్షలు నగదును స్నేహితుడికి అందించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని మిత్రునికి భరోసా కల్పించారు.

వ్యక్తిపై దాడి

నార్పల: మండల కేంద్రంలోని మసీదు కట్ట కాలనీలో శనివారం అర్ధరాత్రి ప్రకాష్‌రెడ్డి అనే వ్యక్తిపై ఇద్దరు యువకులు దాడి చేశారు. వివరాల్లోలు.. మండల కేంద్రానికి చెందిన ప్రకాష్‌రెడ్డి స్థానిక మద్యం దుకాణం వద్ద అనంతపురానికి చెందిన ఇద్దరు యువకులతో ఘర్షణ పడ్డాడు. కోపోద్రిక్తులైన యువకులు ప్రకాష్‌రెడ్డి ఇంటి వద్దకు వెళ్లి అతడిని బయటకు పిలిపించి తలపై బండరాళ్లతో దాడి చేశారు. తీవ్ర గాయాలైన ప్రకాష్‌రెడ్డిని స్థానికులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖరరెడ్డి తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

పెద్దవడుగూరు : అవులాంపల్లి వద్ద ఆదివారం బైక్‌పై వెళ్తున్న మొళకతాళ్ల గ్రామానికి చెందిన రాముడును మరో బైక్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108లో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు.

తప్పులు లేకుండా ఓటరు నమోదు చేయండి



నిట్టూరులో ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఈఆర్వో సుధారాణి

యల్లనూరు: ఓటరు జాబితా తప్పులు లేకుండా తయారు చేయాలని ఈఆర్వో సుధారాణి సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం ఓటరు ప్రత్యేక నమోదు కార్యక్రమంలో భాగంగా నిట్టూరు, పీఎం కొండాపురం పోలింగ్ స్టేషన్లల్లో జరుగుతున్న ఓటరు నమోదు తీరును ఆమె పరిశీలించారు. ఇంటింటా సర్వేను పరిశీలించి బూత్‌లెవెల్ అధికారులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు ఉంటే సవరణ చేసుకోవాలన్నారు. తహసీల్దారు సుమతి, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: ఓటర్ల జాబితా విచారణ ప్రక్రియ వేగవంతం చేయాలని బీఎల్వోలకు తహసీల్దార్ అలెగ్జాండర్ ఆదేశించారు. మండలంలో ఆదివారం జరుగుతున్న ఇంటింటి సర్వేను తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 వరకు మాత్రమే గడువు ఉన్నందున బీఎల్‌ఓలు ఓటరు సర్వే వేగవంతం చేయాలన్నారు. 2024 జనవరి 1 నాటికి ఓటు హక్కు పొందేందుకు అర్హత ఉన్న వారిని గుర్తించి వారి వద్ద నుంచి ఓటు హక్కు నమోదు దరఖాస్తులు తీసుకోవాలన్నారు. డీటీ బాలమ్మ, ఆర్ఐ ఆనందబాబు ఆచారి, వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

గార్లదిన్నె: ఓటరు జాబితా సవరణ పక్కాగా చేపట్టాలని బీఎల్‌ఓలకు తహసీల్దార్ ఉషారాణి ఆదేశించారు. ఆదివారం కల్లూరులో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇంటింటా సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. ఓటరు సవరణ సమయంలో సరైన వివరాలు తీసుకోవాలన్నారు.

పుట్లూరు: కడవకల్లు, మడ్డిపల్లి గ్రామాల్లో ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేను ఆదివారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటిని సందర్శించి తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. తహసీల్దార్ మోహన్‌కుమార్, ఏఎస్‌ఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం.. శ్రేయస్కరం

- తక్కువ నీటితో పంటల సాగు
- ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి





భద్రంపల్లిలో సాగు చేసిన ఉలవ పంట

బుక్కరాయసముద్రం: వర్షాభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు శ్రేయస్కరమని ఏఓ శ్యాంసుందర్ రెడ్డి తెలియజేశారు. దీర్ఘకాలిక పంటలు సాగుకన్నా తక్కువ పెట్టుబడి, నీటితో చిరుధాన్యాలు వేసుకోవచ్చని చెబుతున్నారు. చిరుధాన్యాల సాగుపై తన అభిప్రాయాలను ఏఓ సాక్షితో పంచుకున్నారు. దీర్ఘకాలిక పంటల సాగుకు నీరు అధికంగా ఎంతో అవసరం ఉంటుందన్నారు. పంట సాగుకు కూడా పెద్ద మొత్తంలో పెట్టుబడులు అవసరమవుతాయన్నారు. పంట చేతికి వచ్చే లోపు చీడపీడలు, అనేక రకాల ఒడుదొడుకులను ఎదుర్కోకోవాల్సి ఉంటుందన్నారు. చిరుధాన్యాలు 90–120 రోజుల వ్యవధిలో చేతికి వస్తాయని, వాటికి మార్కెట్‌లో డిమాండ్ ఉందని తెలియజేశారు. .

80 శాతం రాయితీతో విత్తనాలు..

ప్రభుత్వం చిరుధాన్యాల సాగు చేసే రైతులకు 80 శాతం రాయితీతో సరఫరా చేస్తోంది. రాయితీ పోను కొర్రలు 2 కేజీలు రూ.27, అలసందలు ఒక కిలో రూ.23, పెసలు 4 కేజీల ప్యాకెట్ రూ.94 చెల్లించాల్సి ఉంటుంది. రైతులు రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది.

కంది : ఎకరాకు 3–4 కిలోల విత్తనాన్ని వేసుకోవాలి. భూసారాన్ని బట్ట ఎకరాకు 20 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేసుకోవాలి. పూత కాయ దశలో ఉన్నప్పుడు మారుకా మచ్చల పురుగు నివారణకు 1మిల్లీ నోవాల్యురాన్ లేదా క్లోరిఫైరిఫాస్‌ను కలిపి పిచికారి చేయాలన్నారు.

పెసర : పెసరను ఎకరాకు 6–7 కిలోల విత్తనాన్ని విత్తుకోవాలి. వరుసల మధ్య 30 సెంటీమీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. భూసారాన్ని బట్టి ఎకరాకు 20 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను ఎరువుగా వేసుకోవాలి. విత్తిన 20–30 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. తొలి దశలో రసం పీల్చే పురుగులు పూత కాయ దశలో మారుకా మచ్చల పురుగు నివారణ చర్యలు చేపట్టాలి.

జొన్న : ఎకరాకు 4 కిలోల విత్తనాన్ని విత్తుకోవాలి. సాళ్ల మధ్య 45 సెంటీమీటర్లు మొక్కల మధ్య 12–15 సెంటీమీటర్లు దూరంలో గొర్రుతో విత్తుకోవాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల థయోమిథాక్సాం కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. ఎకరాకు 20 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను ఎరువుగా వేసుకోవాలి. విత్తేటప్పుడు 10 కేజీలు యూరియా, 30 రోజులకు 10 కేజీల యూరియా వేసుకోవాలి. కలుపు నివారణకు 800 గ్రాముల అట్రాజిన్ 200 లీటర్లు నీటికి కలిపి తడి నేలకు పిచికారీ చేయాలి. 30 రోజుల తరువాత గుంటకతో అంతర కృషి చేయాలి. మువ్వ చంపే ఈగ నివారణకు కార్బోఫ్యూరాన్ గులికలు ఎకరాకు 4 కిలోల చొప్పున మొక్కల సుడుల్లో వేయాలి.

సజ్జ : ఎకరాకు ఎకరాకు ఒకటిన్నర కిలో విత్తనాన్ని విత్తుకోవాలి. సాళ్ల మధ్య 45 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 12–15 సెంమీ దూరంలో గొర్రుతో విత్తుకోవాలి. ఎకరాకు 50 కిలోల యూరియా, 75 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 35 కిలోల పొటాస్ ఎరువులను వేసుకోవాలి. కలుపు నివారణకు ఎకరాకు 600గ్రాములాట్రాజిన్ మందును 200 లీటర్లు నీటికి కలిపి తడి నేలపై పిచికారి చేయాలి. 30 రోజుల తరువాత దంతులతో లేదా గుంటకతో అంతర కృషి చేయాలి.

కొర్ర : ఎకరాకు 2 కిలోల విత్తనాన్ని విత్తుకోవాలి. సాళ్ల మధ్య 20–22 సెంమీ మొక్కల మధ్య 7 సెంమీ దూరంలో గొర్రుతో విత్తుకోవాలి. ఎకరాకు యూరియా 35 కిలోలు, 50 కిలోలు సింగిల్ ఫాస్ఫేట్ ఎరువులను వేసుకోవాలి.

అలసంద : ఎకరాకు 8–10 కిలో విత్తనాన్ని విత్తుకోవాలి. వరుసల మధ్య 30–45 సెం.మీ దూరంలో ఉండేలా విత్తుకోవాలి. భూసారాన్ని బట్టి ఎరువులు వేసుకోవాలి.

అనుములు : ఎకరాకు 6–8 కిలోల విత్తనాన్ని విత్తుకోవాలి. సాళ్ల మధ్య1–1.5 దూరంలో విత్తుకోవాలి. 5 శాతం వేపగింజల కషాయం పూత కాయ దశలో వున్నప్పుడు పిచికారీచేయాలి. వీటి ద్వారా చీడ పీడలను నివారించుకోవచ్చు.

ఉలవ: ఎకరాకు 10 కిలోలు గొర్రుతో విత్తుకోవాలి. 8 కిలోల యూరియా, 50 కిలోల సింగిల్ ఫాస్ఫేట్ 15 కిలోల పొటాష్ ఎరువులను విత్తేముందు వేసుకోవాలి.

ఎన్నికల్లో అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు

యల్లనూరు: జంగంపల్లి సర్పంచ్, పాతపల్లి, బొప్పేపల్లి వార్డు స్థానాలకు ఈ నెల 19 జరిగే ఉప ఎన్నికల్లో ఎవరైనా అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వేణుగోపాల్ హెచ్చరించారు. ఆదివారం జంగంపల్లి, బొప్పేపల్లిలో పర్యటించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి: పట్టణంలోని నందలపాడులో పేకాట ఆడుతున్న 8 మందిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. నిందితుల నుంచి రూ.6,016 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నీ

పామిడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న వాలీబాల్ టోర్నీ ఆదివారం ముగిసింది. విజేతల జట్లకు ఈశా ఫౌండేషన్ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు.